




షబ్-ఎ-ఖదర్ షాన్..!

రంజాన్ మాసంలో ముఖ్యమైన షబ్-ఎ-ఖదర్‌ను శనివారం రాత్రి ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జగ్నేకీరాత్ సందర్భంగా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి, రాత్రంతా జాగారం ఉన్నారు.

భానుడి భగభగ



సంగారెడ్డి, ఏప్రిల్ 6, (ఆంధ్రజ్యోతి): భానుడు రోజురోజుకూ తన ఉగ్రరూపాన్ని ప్రదర్శిస్తున్నాడు. ఎండ, వేడి, ఉక్కపోతతో జనం అల్లాడుతున్నారు. శనివారం సంగారెడ్డి జిల్లా సదాశివపేట, కంది ప్రాంతాల్లో 42.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సంగారెడ్డి, మెదక్ జిల్లాలోని పలు ప్రాంతాలలో 40 డిగ్రీల నుంచి 42.6 డిగ్రీల వరకు నమోదయ్యాయి. ఇక సిద్దిపేట జిల్లాలో గరిష్ఠంగా 41.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండలు మండిపోతుండటంతో ప్రజలు ఉక్కపోతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి పూట ఉష్ణోగ్రతలు 27 డిగ్రీలు ఉండటంతో ప్రజలు వేడికి తాళలేకపోతున్నారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు.

సిద్దిపేటకు అన్యాయం చేసిన రేవంత్

- గద్దలాగా వెటర్నరీ కళాశాలను తీసుకెళ్లాడు
- ఏ మొహం పెట్టుకొని ఓట్లు అడుగుతారు
- బీజేపీకి ఒక్క ఓటు కూడా పడకూడదు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేటటౌన్/ సిద్దిపేటరూరల్/ నారాయణరావుపేట ఏప్రిల్ 6: సిద్దిపేటకు సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర అన్యాయం చేశారని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. శనివారం సిద్దిపేటలోని ఆయన నివాసంలో బీఎస్పీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ మద్దెల నర్సింహులు తన అనుచరులతో కలిసి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. సిద్దిపేట రూరల్ మండలం, నారాయణరావుపేట మండలం జక్కాపూర్‌లో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిద్దిపేట ప్రజలకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ఓటు అడిగే హక్కు ఎక్కడిదని ఆయన ప్రశ్నించారు. నాడు అభివృద్ధిని కాంగ్రెస్ ఓర్వలేదని, నేడు అభివృద్ధి పనులు తీసుకెళ్తే మీరు ఓట్లు ఎలా అడుగుతారన్నారు. సిద్దిపేటను విద్యాలయాలకు నిలయంగా మార్చుకున్నామని, కానీ సిద్దిపేటలోని వెటర్నరీ కాలేజీ రద్దు చేసి గద్దలాగా కళాశాలను కొడంగల్‌ను తీసుకెళ్తున్నారని మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేకపోతే గద్దె దిగాలన్నారు. నేడు రాహుల్ గాంధీ విడుదల చేస్తున్న జాతీయ మ్యానిఫెస్టోను ఎవరూ నమ్మరని ఆయన స్పష్టం చేశారు. డిసెంబరు 9 నాడే రైతులకు రూ.2లక్షల రుణ మాఫీ, గృహిణులకు రూ.2500, వివిధ రకాల పెన్షనర్లకు రూ.4వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడు మాట మారుస్తున్న రేవంత్‌రెడ్డికి ఓటేస్తే మిమ్మల్ని మీరు మోసం చేసుకున్న వారు అవుతారన్నారు. రూ.2లక్షల రుణమాఫీ అయిన వారు మాత్రమే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని చెప్పారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను, బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు చేసిన విమర్శలను ఎల్ఈడి స్క్రీన్ ద్వారా కార్యకర్తలకు చూపించారు. ఎంపీగా వెంకట్రామారెడ్డిని గెలిపించి వారికి బుద్ధి చెప్పాలని కోరారు. ఒక్క ఓటు కూడా బీజేపీకి వెళ్లకూడదని, రాజ్యాంగం మారుస్తానంటున్న బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలని ఆయన పేర్కొన్నారు.

ఇచ్చిన హామీలను నెరవేరుస్తా

బీఆర్ఎస్ పార్టీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి పి.వెంకట్రామారెడ్డి మాట్లాడుతూ.. ఏడున్నరేళ్లుగా సిద్దిపేట ప్రాంతానికి అధికారిగా పనిచేశానని, ప్రత్యక్షంగా, పరోక్షంగా తాను పరిచయస్తుడినేనని చెప్పారు. మెదక్ ఎంపీగా గెలిచిన నెల రోజులకే పీవీఆర్ ట్రస్టు ఏర్పాటు చేసి రూ.100 కోట్ల నిధిని ఏర్పాటు చేస్తామన్నారు. ఆ నిధి ద్వారా విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం, నిరుద్యోగ యువతకు, మహిళలకు ప్రత్యేక శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తానన్నారు. ఫంక్షన్‌హాల్స్ నిర్మిస్తామని చెప్పారు. ట్రస్టు ద్వారా ఉచితంగా కోచింగ్ సౌకర్యం కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు. తనను నమ్మి అవకాశం ఇస్తే ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఆయా మండల అధ్యక్షులు, మాజీ ఎంపీపీ యాదయ్య, ఎంపీపీ శ్రీదేవి చందర్‌రావు, ఎంపీపీ ఒగ్గు బాలకృష్ణ, మండల అధ్యక్షుడు ఎల్లయ్య, ఎంపీపీ ఉపాధ్యక్షుడు శేరుపల్లి యాదగిరి, సుడా మాజీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా చూపిస్తున్న హరీశ్‌రావు

డిగ్రీ విద్యార్థుల నుంచి అదనంగా రూ.50 వసూలు!

- పరీక్ష ఫీజుతో పాటు చెల్లించాలని హుకుం
- ప్రతి సెమిస్టర్‌కు ఒక్కో విద్యార్థి నుంచి వసూలు

గజ్వేల్, ఏప్రిల్ 6: గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పరీక్షా ఫీజుతో పాటు అదనపు రుసుంను వసూలు చేస్తున్నారు. గత మూడు సెమిస్టర్ల నుంచి ఇదే విధంగా వసూళ్లకు పాల్పడుతున్నారు. పరీక్ష ఫీజుతో పాటుగా అదనంగా చెల్లించాల్సిందేనని కళాశాల అధ్యాపకులు హుకుం జారీ చేశారు. అయితే, ఈ అదనపు వసూళ్ల విషయమై కళాశాల ప్రిన్సిపల్‌ను వివరణ కోరితే ఆన్‌లైన్ దరఖాస్తు చేయడానికి వసూలు చేస్తున్నామని చెప్పారు. కళాశాల విద్యార్థులు బయట ఆన్‌లైన్ చేయిస్తే రూ.100 అవుతుందని, అందుకే కళాశాలలోనే చేయిస్తున్నామని బదులిచ్చారు. పరీక్ష ఫీజుకు ఆన్‌లైన్ అప్లికేషన్‌కు సంబంధం ఏంటో అర్థం కావడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. ఈ విషయమై ఉన్నత విద్యామండలి అధికారులను వివరణ అడిగితే విద్యావిద్యార్థులు చెల్లించిన మొత్తానికి రశీదు తీసుకోవాలని, లేదంటే అదనంగా చెల్లించవద్దని తెలిపారు.

ఎజెండా అంశాలు 47 చర్చించినవి ఎనిమిదే..!

సాదాసీదాగా జడ్పీ సమావేశం

- నామమాత్రంగా హాజరైన జడ్పీటీసీలు, ఎంపీపీలు
- పాల్గొన్న జడ్పీచైర్‌పర్సన్ రోజాశర్మ కలెక్టర్ మనుచౌదరి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి

సిద్దిపేట అగ్రికల్చర్, ఏప్రిల్ 6 : జిల్లా అభివృద్ధిపై సుదీర్ఘంగా చర్చించేందుకు ఎజెండాలో 47 అంశాలను ప్రతిపాదించగా కేవలం 8 అంశాలను మాత్రమే చర్చించి జడ్పీ సమావేశాన్ని ముగించారు. శనివారం సిద్దిపేటలోని విపంచి కళానిలయంలో జడ్పీచైర్‌పర్సన్ రోజారాధాకృష్ణశర్మ అధ్యక్షతన జడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టర్ మనుచౌదరి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, జడ్పీ సీఈవో రమేష్, జిల్లాలోని వివిధ మండలాల జడ్పీటీసీలు, ఎంపీపీలు, అధికారులు పాల్గొన్నారు. సమావేశం ఉదయం 10:30 ప్రారంభం కావాల్సి ఉండగా 11:10కి ప్రారంభించారు. సభ ప్రారంభ సమయంలో ఏడుగురు జడ్పీటీసీలు, ముగ్గురు ఎంపీపీలు మాత్రమే హాజరవ్వడం గమనార్హం.

ఎన్నికల కోడ్ దృష్ట్యా కేవలం ప్రజలకు అవసరమైన, అమలులో ఉన్న వివిధ పథకాల ప్రగతిపైనే చర్చించాలని జడ్పీచైర్‌పర్సన్ సూచించడంతో వ్యవసాయ, ఉద్యానవన, వైద్య ఆరోగ్య, జిల్లా గ్రామీణ అభివృద్ధి, మిషన్ భగీరథ, పౌరసరఫరాల, జిల్లా పంచాయతీ, విద్యుత్‌శాఖల పైనే చర్చ జరిగింది.


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ రోజారాధాకృష్ణ శర్మ, పక్కన కలెక్టర్ మనుచౌదరి

వడదెబ్బతో ఒక్కరూ కూడా మరణించకూడదు

యాసంగిలో ఎండిపోయిన వరి, మక్క పంటలకు నష్టపరిహారం అందేలా అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందించాలని జడ్పీచైర్‌పర్సన్ రోజాశర్మ తెలిపారు. ఎండాకాలంలో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం రాకూడదని చెప్పారు. ఉపాధిహామీ పనులు చేపట్టే ప్రాంతాల్లో అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆమె సూచించారు. వడదెబ్బతో జిల్లాలో ఒక్కరు కూడా మరణించకుండా ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేయాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు.


సభ్యులు హాజరుకాకపోవడంతో ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు

తాగునీటికి ఇబ్బందులు రావొద్దు

జిల్లాలో ఎండాకాలంలో తాగునీటి ఇబ్బంది రాకుండా నెల రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని కలెక్టర్ మనుచౌదరి సూచించారు. ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తితే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 08457 230000 ఫోన్ చేస్తే వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. వరి కొనుగోలు చేసేందుకు జిల్లాలో 418 కేంద్రాలను ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. పొద్దుతిరుగుడు కొనుగోలుకు ప్రభుత్వ అనుమతి రాగానే కొనుగోళ్లు చేపడతామని స్పష్టం చేశారు. ఈసారి వరిధాన్యం కొనుగోలులో రైతుల ఐరిస్ టెక్నాలజీని ఉపయోగిస్తామని తెలిపారు. తొలిసారిగా జడ్పీసర్వసభ్య సమావేశానికి హాజరైన కలెక్టర్‌ను జడ్పీచైర్‌పర్సన్ రోజాశర్మ, ఎమ్మెల్సీ యాదవరెడ్డి సన్మానించారు.

గళమెత్తిన సభ్యులు

- ఎండిన పంటలకు ప్రభుత్వం పరిహారమిచ్చి రైతులను ఆదుకోవాలని, ఇటీవల కురిసిన వడగండ్ల వర్షానికి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని దుబ్బాక మండలంలోని పలు గ్రామాలకు మిషన్ భగీరథ నీరు రాక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని దుబ్బాక జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి సభ దృష్టికి తీసుకొచ్చారు.
- గ్రామాల్లో నెలరోజుల నుంచి ఇష్టానుసారంగా విద్యుత్ కోతలు పెడుతున్నారని, అడిగితే అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని కొమురవెల్లి జడ్పీటీసీ సిద్ధప్ప, మిరుదొడ్డి ఎంపీపీ సాయిలు తెలిపారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని వారు కోరారు.
- అర్హులైన వారికి జీరో కరెంట్ బిల్లు రావడంలేదని సంబంధిత అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని రాయపోల్ జడ్పీటీసీ యాదగిరి కోరారు.

మల్లన్న భక్తులపై ఇదేం దురుసుతనం!

- సెల్‌ఫోన్, చెప్పుల స్టాండు నిర్వహకుల దాడిపై ఆగ్రహం
- చర్యలు తీసుకోని ఆలయవర్గాలు
- సిబ్బంది తీరుపై భక్తుల మండిపాటు

నోళ్లు తెరిచిన బోర్లతో పొంచి ఉన్న ప్రమాదం

7లో

కొమురవెల్లి ఆలయంలో కాసుల గలగల

- 11 వారాల్లో 10 లక్షల మంది భక్తుల రాక
- రూ.6.07 కోట్ల బుకింగ్, రూ.4.91 కోట్ల హుండీ ఆదాయం
- నేటి వారంతో ముగియనున్న జనజాతర
- భారీగా తరలిరానున్న భక్తులు
- ఆదాయం మరింత పెరిగే అవకాశం

చేర్యాల, ఏప్రిల్ 6 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నట్లే కాసుల వర్షమూ కురుస్తున్నది. హుండీల్లో కానుకల గలగలతో పాటు బుకింగ్ ఆదాయం గణనీయంగా పెరుగుతుండటంతో రికార్డు స్థాయిలో ఖజానా నిండుతుంది. ఆలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈ ఏడాది 12 లక్షల మంది భక్తులు తరలివస్తారని అంచనా వేయగా ఇప్పటి వరకు 9 లక్షలకు పైగా భక్తులు తరలివచ్చినట్లు ఆలయవర్గాలు చెబుతున్నాయి. నేడు ఆదివారం నిర్వహించనున్న అగ్నిగుండాల కార్యక్రమంతో మహాజాతర ముగియనున్నది.

రూ.6.07 కోట్ల బుకింగ్ ఆదాయం

పదకొండు వారాల జాతరలో భాగంగా మొదటివారం రూ.70,22,307, 2వ వారం రూ.59,71,343, 3వ వారం రూ.55,70,464, 4వ వారం రూ.56,12,921, 5వవారం రూ.56,03,330, 6వవారం రూ.37,79,389, 7వవారం రూ.36,13,367, 8వ వారం రూ.46,87,250, 9వ వారం రూ.45,63,172, 10వ వారం రూ.43,76,829, 11వ వారం రూ.63,97,077, చొప్పున రూ.5,71,97,449 ఆదాయం సమకూరింది. గత జనవరి 7న జరిగిన కల్యాణం సందర్భంగా రూ.18,74,449, మహాశివరాత్రిని పురస్కరించుకుని రూ.16,54,043 ఆదాయం రాగా మొత్తం మూడునెలల కాలంలో రూ.6,07,25,941 ఆదాయం వచ్చింది. నేడు జరగనున్న 12వ వారం సందర్భంగా మరో రూ.40- 50లక్షల ఆదాయం సమకూరనుందని ఆలయవర్గాలు చెబుతున్నాయి.

హుండీల్లోనూ..

జనవరి 7న నిర్వహించిన మల్లన్న కల్యాణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి ప్రతి శని, ఆదివారంతో పాటు బుధవారం కూడా భక్తులు తరలివచ్చి కానుకలు సమర్పించారు. గతంలో ఎన్నడు లేనివిధంగా ఎప్పుడు హుండీలు విప్పినా రూ.కోటి మించి ఆదాయం వస్తుంది. జనవరిలో రెండుసార్లు చేపట్టిన లెక్కింపులలో 26 రోజులకు రూ.69,08,932, మరో 24 రోజులకు రూ.1,39,77,230, ఫిబ్రవరి లో చేపట్టిన లెక్కింపులో 21రోజులకు రూ.1,15,59,209, మార్చిలో రెండుసార్లు లెక్కింపులు చేపట్టగా, 26 రోజులకు రూ.1,04,86,906, 16 రోజులకు రూ.61,89,123 చొప్పున 5 సార్లు చేపట్టిన లెక్కింపుల ద్వారా రూ.4,91,21,400 నగదు, 375 గ్రాముల బంగారం, 49.300 కిలోల వెండిమిశ్రమం లభ్యమైంది. 12వవారంతో జాతర ముగియనుండటంతో మరోమారు హుండీలెక్కింపులు చేపట్టనున్నందున మరోమారు కోటి దాటుతుందని ఆలయాధికారులు భావిస్తున్నారు.


మల్లన్న ఆలయంలోని కానుకలను లెక్కిస్తున్న మహిళాసేవాసమితి సభ్యులు

రికార్డు స్థాయిలో ఆదాయం



\- బాలాజీశర్మ, ఈవో

గతంలో స్వామివారి వార్షిక ఆదాయం వందల్లో ఉండేది. రానురాను భక్తుల సంఖ్యపెరగడం, ఎవరికీ ఇబ్బందులు తలెత్తకుండా వసతుల కల్పన చేపట్టడం, అవినీతికి తావులేకుండా చర్యలు తీసుకోవడంతో రికార్డుస్థాయిలో ఆదాయం సమకూరింది. ఇప్పటి వరకు 10 లక్షల మందిపైగా భక్తులు ఆలయాన్ని సందర్శించారు.

కొండపోచమ్మ హుండీ ఆదాయం రూ. 7,47,890

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 6: జగదేవ్‌పూర్ మండలంలోని తిగుల్ నర్సాపూర్ సమీపంలోని కొండపోచమ్మ అమ్మవారి ఆలయ హుండీని దేవాలయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో శనివారం లెక్కించారు. 50 రోజులకు గాను రూ. 7,47,890 ఆదాయం సమకూరినట్లు దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్, ఆలయ ఈవో మోహన్‌రెడ్డి తెలిపారు. ఆ మొత్తాన్ని అమ్మవారి ఆలయ ఖాతాలో జమచేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు, ఆలయ సిబ్బంది వెంకట్‌రెడ్డి, కనకయ్య, పూజారులు మల్లయ్య, లక్ష్మణ్, కొండయ్య, తిరుపతి, గోవర్దన్ తదితరులు ఉన్నారు.


హుండీల్లోని కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

గ్యాస్ లీకై మంటలు

- తల్లి, కూతురికి గాయాలు
- ఇల్లు దగ్ధం, రూ.20వేల ఆస్తి నష్టం
- తప్పిన పెను ప్రమాదం

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 6 : ఓ ఇంట్లో గ్యాస్ లీకై మంటలు చెలరేగడంతో తల్లి, కూతురు గాయపడిన సంఘటన జగదేవ్‌పూర్ మండలం మునిగడపలో శనివారం చోటుచేసుకున్నది. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్డె కనకవ్వ ఉదయం గ్యాస్‌స్టవ్‌పై వంట చేస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగి సిలిండర్ వరకు వ్యాపించాయి. కాసేపటికి గుడిసె దగ్ధమైంది. గమనించిన స్థానికులు మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో ఇంట్లో ఉన్న కనకవ్వ, కూతురు అశ్వినికి స్వల్పగాయాలయ్యాయి. వారిని అంబులెన్స్‌లో గజ్వేల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సుమారు 20వేల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు.


దగ్ధమైన గుడిసె


గాయపడిన కనకవ్వ

కొల్చారం మండలంలో కవాతు

కొల్చారం, ఏప్రిల్ 6 : కొల్చారం మండలంలోని పలు గ్రామాల్లో పారా మిలటరీ బలగాలు, పోలీసులు శనివారం కవాతు నిర్వహించారు. పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మెదక్ జిల్లా ఎస్పీ బాలస్వామి ఆదేశాల మేరకు కొల్చారం ఎస్‌ఐ మహ్మద్‌గౌస్ ఆధ్వర్యంలో పోతంశెట్‌పల్లి చౌరస్తా, వెంకటాపూర్, కిష్టాపూర్, రాంపూర్ గ్రామాల్లో కవాతు నిర్వహించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



రైతు బాంచె మహేందర్ మృతదేహం

కొల్చారం, ఏప్రిల్ 6 : అప్పుల బాధతో రైతు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మెదక్ జిల్లా కొల్చారం మండల పరిధిలో శనివారం చోటు చేసుకున్నది. ఎస్ఐ మహ్మద్ గౌస్ తెలిపిన వివరాల ప్రకారం.. వరిగుంతం గ్రామానికి చెందిన బాంచె మహేందర్(35) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తనకున్న రెండెకరాలలో పంట సాగు చేసేందుకు అప్పులు చేశాడు. నీళ్లు పారక పంట ఎండిపోయేసరికి తాగుడుకు బానిసయ్యాడు. అప్పు ఎలా తీర్చాలనే బాధతో శుక్రవారం రాత్రి భార్యాపిల్లలతో కలిసి భోజనం చేసి ఇంటి బయట వాకిట్లో పడుకున్నాడు. తెల్లవారుజామున ఇంటి ఎదుట ఉన్న రేకులషెడ్డులో చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మహేందర్‌కు భార్య సునీత, కూతురు, కుమారుడు ఉన్నారు. మహేందర్ తండ్రి బాంచె శంకరయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమ విఫలమైందని ఉరేసుకున్న యువకుడు



భ్యాగరి ప్రశాంత్(ఫైల్)

మనోహరాబాద్, ఏప్రిల్ 6: ప్రేమించిన అమ్మాయి వేరే వారిని పెళ్లి చేసుకోవడంతో మనోవేదనకు గురైన యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల పరిధిలో శుక్రవారం చోటు చేసుకున్నది. ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కాళ్లకల్ గ్రామానికి చెందిన భ్యాగరి స్వామికి ఇద్దరు కూమారులు, ఒక కూతరు ఉన్నారు. శుక్రవారం తన కుటుంబసభ్యులు అందరూ కలసి అల్లిపూర్‌లో ఉన్న తన కూతురు వద్దకు దావత్ వెళ్లారు. కుమారుడు భ్యాగరి ప్రశాంత్(24) ఒక్కడే సాయత్రం తిరిగి కాళ్లకల్‌లోని తన ఇంటికి వచ్చాడు. వారి తల్లిదండ్రులు కూడా తిరిగి రాత్రి 10.30 గంటలకు సమాయనికి ఇంటికి వచ్చి చూడగా ప్రశాంత్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. కుటుంబసభ్యులు స్థానికుల సహాయంతో ప్రశాంత్‌ను తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రశాంత్ అప్పటికే మరణించాడని వైద్యులు తెలిపారు. మేడ్చల్ పట్టణంలో యువతిని ప్రేమించాడని, అమ్మాయి వేరే వారిని పెళ్లిచేసుకోవడంతో ఆ బాధ తట్టుకోలేక బలవన్మరణానికి పాల్పడ్డాడని కుటుంబసభ్యులు తెలిపారు. తండ్రి భ్యాగరి స్వామి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్నేహితులతో సరదాగా ఈతకు వెళ్లి..

సింగూరు కాలువలో యువకుడి గల్లంతు

● నీరు నిలుపుదలతో మృతదేహం లభ్యం



వినోద్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

పుల్‌కల్, ఏప్రిల్ 6 : ఈత కోసం సింగూరు కాలువలో దిగిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు మునిగి గల్లంతైన సంఘటన మండలంలోని బస్వాపూర్ గ్రామంలో శనివారం జరిగింది. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... బస్వాపూర్ గ్రామానికి చెందిన డప్పు విజయరావు, నీలమ్మ దంపతులకు వినీత్, వినోద్ ఇద్దరు కుమారులు. తండ్రి విజయరావు అనారోగ్యంతో మృతిచెందగా, వినోద్(22) సదాశివపేట సమీపంలోని ఎంఆర్ఎఫ్ టైర్ల పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం ఇంటి వద్దనే ఉన్న వినోద్ స్నేహితులతో కలిసి ఉదయం గ్రామ శివారులోని సింగూరు ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువలో ఈతకు వెళ్లారు. స్నేహితులంతా కాలువ నీటిలో ఈత కొడుతుండగా, వినోద్‌కు ఈత రాకపోవడంతో తెప్ప సహాయంతో నీటిలోకి దిగాడు. ఈ క్రమంలో తెప్ప పక్కకు జారిపోవడంతో వినోద్ నీటిలో మునిగిపోయాడు. వినోద్‌ను రక్షించేందుకు తోటి స్నేహితులు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. నీటిలో గల్లంతుకావడంతో స్నేహితులు అతడి కోసం గాలింపు చేపట్టినా ప్రయోజనం లేకుండాపోయింది. ఘటన విషయాన్ని గ్రామ పెద్దలకు తెలియజేయగా, వారు నీటిపారుదలశాఖ అధికారులతో మాట్లాడి సింగూరు ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ నీటి ప్రవాహన్ని నిలిపి వేయించారు. అనంతరం నీటి ప్రవాహం తగ్గడంతో స్థానిక మత్స్యకారులు గాలింపు చర్యలు చేపట్టారు. రెండు గంటల పాటు శ్రమించగా మునిగిపోయిన ప్రాంతానికి అర కిలోమీటరు దూరంలో మృతదేహం లభించింది. వినోద్ మృతదేహం ఒడ్డుకు చేర్చడంతో కుటుంబసభ్యులు బోరున విలపించారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పుల్కల్ ఎస్ఐ కె.శ్రీకాంత్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్‌పై నుంచి పడి యువకుడి మృతి



జాల నరేష్ మృతదేహం

వెల్దుర్తి, ఏప్రిల్ 6 : ట్రాక్టర్‌పై నుంచి పడి యువకుడు మృతి చెందిన సంఘటన మెదక్ జిల్లా వెల్దుర్తి మండలంలోని హస్తాల్‌పూర్ గ్రామ శివారు వద్ద శనివారం చోటుచేసుకున్నది. మృతుడి కుటుంబసభ్యులు తెలిసిన వివరాలు ప్రకారం.. మండలంలోని మన్నెవారి జలాల్‌పూర్ గ్రామానికి చెందిన జాల నరేష్(19) అదే గ్రామానికి చెందిన చిట్యాల యాదగౌడ్ కలిసి ట్రాక్టర్‌లో గడ్డిని తరలించి తిరిగి గ్రామానికి వస్తున్న క్రమంలో హస్తాల్‌పూర్ వద్ద నరేష్ ఒక్కసారిగా ట్రాక్టర్‌పై నుంచి కింద పడడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. నరేష్ మృతదేహన్ని రోడ్డుపక్కన పొలం వద్ద ఉన్న పూరి గుడిసెలో ఉంచి యాదగౌడ్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. ఘటనా స్థలానికి వెల్దుర్తి పోలీసులు వెళ్లి పరిశీలించి నరేష్‌ను తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నరేష్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు కూడా నిర్ధారించారు. నరేష్‌ను యాదగౌడ్ చంపిఉంటాడని, ఆయనను రక్షించడానికి పోలీసులు సహకరిస్తున్నారని మృతుడి తండ్రి గణేష్ ఆరోపించారు. ఈవిషయమై పోలీసులను సంప్రదించడానికి ప్రయత్నించినా వారు స్పందించలేదు.

భర్తను కిడ్నాప్ చేయించిన భార్య

● పలువురిపై కేసు నమోదు

హుస్నాబాద్, ఏప్రిల్ 6 : భార్య భర్తను కిడ్నాప్ చేయించగా, పలువురిపై కేసు నమోదైన ఘటన శనివారం హుస్నాబాద్‌లో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హుస్నాబాద్ పట్టణంలోని హన్మకొండ రోడ్డులో అక్కన్నపేట మండలం నందారం గ్రామానికి చెందిన లింగాల సురేష్, అతని భార్య మాధవి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయంపై ఇద్దరు విడిపోయేందుకు పంచాయతీలు కూడా జరిగాయి. ఈ క్రమంలో శనివారం హుస్నాబాద్‌కు వచ్చిన సురేష్‌ను మాధవితో పాటు మరికొందరు కారులో కిడ్నాప్ చేశారు. సురేష్ తండ్రి మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాధవితో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాహనాల తనిఖీలో రూ.లక్ష పట్టివేత



వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

చేగుంట, ఏప్రిల్ 6 : ఎన్నికల విధుల్లో భాగంగా చేగుంట పోలీసులు మక్కరాజుపేట అండర్ బ్రిడ్జి వద్ద శనివారం వాహనాలను తనిఖీ నిర్వహించారు. చేగుంట నుంచి మక్కరాజుపేట వైపు దౌల్తాబాద్ మండలం నర్సంపల్లి గ్రామానికి చెందిన పశువుల స్వామి బైక్‌పై వెళుతుండగా పోలీసులు ఆపి తనిఖీ చేశారు. బైక్ ట్యాంకు కవర్‌లో రూ.లక్ష నగదు తీసుకెళుతుండగా, ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఎస్ఐ బాల్‌రాజు సీజ్ చేశారు.

మల్లన్న భక్తులపై ఇదేం దురుసుతనం!

● సెల్‌ఫోన్, చెప్పుల స్టాండు నిర్వహకుల దాడిపై ఆగ్రహం
● చర్యలు తీసుకోని ఆలయ వర్గాలు
● సిబ్బంది వ్యవహరిస్తున్న తీరుపై మండిపడుతున్న భక్తులు





మల్లన్న క్షేత్రంలోని దర్శన క్యూలైన్ వద్ద హన్మకొండ భక్తుడిపై దాడి చేస్తున్న సెల్‌ఫోన్ టెండర్‌దారుడి సిబ్బంది(ఫైల్), ఆలయ ఆవరణలోని చెప్పులస్టాండులో అనధికారికంగా లగేజీ బ్యాగులు

చేర్యాల, ఏప్రిల్ 6 : కొమురవెల్లి మల్లన్న భక్తులపై పలువురు టెండర్‌దారుల సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తుండడంతో నొచ్చుకుంటున్నారు. టెండర్ నిబంధనలు పాటించకపోగా, భక్తులపై దురుసుగా ప్రవర్తిస్తూ చేయిచేసుకుంటున్నా ఆలయ వర్గాలు చోద్యంచూస్తుండడం పట్ల మండిపడుతున్నారు. తమ మనోభావాలు దెబ్బతీస్తున్నా పట్టించుకోకపోవడం తగదంటూ వాపోతున్నారు. కొద్దిరోజుల క్రితం సెల్‌ఫోన్ భద్రపరిచే కౌంటర్ నిర్వహకుడి సిబ్బంది భక్తులపై దాడికి పాల్పడగా, వారం క్రితం చెప్పులస్టాండు నిర్వహకుడి సిబ్బంది భక్తులపై దాడి చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా వరుస దాడి ఘటనలు చోటుచేసుకుంటుండటం వివాదాస్పదమవుతుంది.

మల్లన్న ఆలయానికి యేటా లక్షలాదిమంది భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో సెల్‌ఫోన్ డిపాజిట్‌తో పాటు చెప్పులు భద్రపరిచేందుకు టెండర్లు నిర్వహిస్తున్నారు. తద్వారా లక్షల్లో ఆదాయం సమకూరుతున్నప్పటికీ పలువురు సిబ్బంది దుర్వినియోగానికి పాల్పడుతూ భక్తులతో గలాటాకు దిగుతున్నారు. వారి తీరుపై ఫిర్యాదులు అందినా ఆలయ వర్గాలు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కౌంటర్ వద్దకు వచ్చిన భక్తుడి సెల్‌ఫోన్‌ను మాత్రమే డిపాజిట్ చేసి రశీదు అందివ్వాల్సి ఉండగా, ప్రత్యేకంగా సిబ్బందిని నియమించుకుని డిటెక్టర్లతో తనిఖీ చేయిస్తూ బలవంతంగా లాక్కుంటున్నారు. లేకుంటే దర్శనానికి పంపించకుండా అడ్డుకుంటున్నారు. ఫిబ్రవరి7న హన్మకొండ జిల్లాకు చెందిన భక్తులతో గొడవపడి దాడికి పాల్పడ్డారు. అలాగే చెప్పులస్టాండు నిర్వహకుడు టెండర్ నిబంధనలకు విరుద్ధంగా లగేజీ బ్యాగులను అనధికారికంగా భద్రపరుచుకుంటూ డబ్బు వసూలు చేస్తుండటంతో పాటు ఆలయ పరిసరాలు, దుకాణాల ఆవరణలో విడిచిన చెప్పులను తీసుకు వెళుతూ డబ్బు చెల్లిస్తేనే ఇస్తామని భక్తులతో వాగ్వాదానికి దిగుతున్నారు. ఇదేంటని ప్రశ్నించిన వారితో గొడవకు దిగడమే కాకుండా, గత శనివారం షాద్‌నగర్‌కు చెందిన ఇద్దరు భక్తులపై దాడిచేయడంతో గాయాలపాలయ్యారు. టెండర్ నిబంధనలు బేఖాతరు చేయడాన్ని కనీసం పట్టించుకోని ఆలయవర్గాలు భక్తులపై దాడులకు పాల్పడుతున్న విషయాన్ని విస్మరిస్తుండటం పట్ల ఆగ్రహం పెల్లుబికుతుంది. భక్తుల మనోభావాలకు భంగం కలిగించకుండా వ్యవహరిస్తున్నామని పాలకమండలి సభ్యులు చెబుతున్నా గాయపరిచే వరకు దారితీస్తుండటంపై దేవాదాయశాఖ ఉన్నతాధికారులు స్పందించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఈవో బాలాజీశర్మను వివరణ కోరగా భక్తులపట్ల దురుసుగా ప్రవర్తించకూడదని, టెండర్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

నోళ్లు తెరిచిన బోర్లతో పొంచి ఉన్న ప్రమాదం

నీరుపడని గుంతలను పూడ్చడంపై నిర్లక్ష్యం



మద్దూరు మండలం ధర్మారంలో ఓ రైతు పూడ్చకుండా వదిలేసిన బోరుబావి

మద్దూరు, ఏప్రిల్ 6 : బోరు గుంతలపై నిర్లక్ష్యపు నీడ కమ్ముకున్నది. చుక్కనీరు పడని బోరుబావుల్లో నుంచి కేసింగ్ తీసేసి పూడ్చకుండా వదిలేస్తున్నారు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతున్నది. నిబంధనల ప్రకారం రైతులు బోరుబావులను తవ్వాలంటే స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రైతు భూమిని జియాలజిస్ట్ పరిశీలించి అక్కడ నీరు లభించేది లేనదీ క్షుణ్ణంగా పరిశీలించాలి. నీరు లభిస్తుందని నిర్ధారిస్తే సర్టిఫికేట్‌తో పాటు చుట్టుపక్కల రైతుల బోరుబావులకు కనీసం 250 మీటర్ల దూరంలో కొత్త బోరుబావిని తవ్వేందుకు అనుమతినిస్తారు. మద్దూరు మండలంలో రైతులు ఇవేమీ పట్టించుకోవడం లేదు. ఇష్టానుసారంగా బోర్‌వెల్ యంత్రాలతో సుమారు 300 నుంచి 500 అడుగులపైనే బోర్లు వేసేస్తున్నారు.

మద్దూరు మండలం ధర్మారం గ్రామంలో ఓ రైతు గతేడాది వ్యవసాయభూమిలో బోరు వేశారు. నీళ్లు పడకపోవడంతో పూడ్చకుండా వదిలేశారు. మనుషులతో పాటు పశువులు ప్రమాదవశాత్తు ఆ గుంతలో పడి, జరగరానిది జరిగితే బాధ్యులు ఎవరన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. చాలా మంది రైతులు నీరు వస్తే సరేసరి లేదంటే కేసింగ్ తీసేస్తున్నారు. అదే సమయంలో ఆ గుంతను పూడ్చకుండా వదిలేస్తుండటంతో ప్రమాదకరంగా మారుతోంది. నోళ్లు తెరిచిన బోరుబావులు ఉండకూడదన్న జిల్లా అధికారుల ఆదేశాలు మండల స్థాయి అధికారులకు పట్టకపోవడం శోచనీయం. క్షేత్రస్థాయిలో ఆరా తీసి పూడ్చివేయించాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. తవ్వి వదిలేసిన బోరుబావుల విషయమై రైతులకు గ్రామసభలు నిర్వహించి అవగాహన కల్పించాల్సి ఉన్నా ఇక్కడ జరగడం లేదు. రైతులు ఎక్కడెక్కడ ఎన్ని బోర్లు వేస్తున్నారో గ్రామపంచాయతీ అధికారులకు, రెవెన్యూ అధికారులకు తెలియకపోవడం గమనార్హం. ప్రమాదకరంగా మారిన బోరుబావులను ఇప్పటి వరకు ఎన్ని మూసివేశారో లెక్క అధికారులకే తెలియదనే ఆరోపణలున్నాయి. ఇటీవల చాలామంది రైతులు తమ పంటపొలాలు ఎండిపోకుండా ఉండేందుకు బోర్లువేస్తూ భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. చాలాచోట్ల నీరుపడకపోవడంతో వాటిని పూడ్చకుండా అలాగే వదిలేస్తున్నారు క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది నెలకోమారు పర్యవేక్షిస్తే నిరుపయోగంగా ఉన్న బోరుబావులను గుర్తించవచ్చు. అలాగే ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

దేశాభివృద్ధి కోసం

బీజేపీకి పట్టం కట్టండి

● మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు
● సంగారెడ్డిలో ఎన్నికల ప్రచారం

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 6 : దేశాభివృద్ధి, సనాతన ధర్మ రక్షణ కోసం బీజేపీకి ఓటు వేయాలని మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు కోరారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో ఆయన శనివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. తొలుత ఉదయం ఆరు గంటలకు కలెక్టరేట్ వెనక పార్క్, తారా డిగ్రీ కళాశాల మైదానం, అంబేడ్కర్ మైదానంలోని వాకర్స్‌తో కలిసి ముచ్చటించారు. అనంతరం రాంనగర్‌లోని రామాలయం, శ్రీనగర్‌లోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత ప్రచార రథాలతో ఒకటి, రెండు, మూడు వార్డుల్లో ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు అందజేస్తూ ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ మెదక్‌లో బీజేపీ ఎంపీ గెలుపు ఖాయమైందని, మెజార్టీ కోసమే ప్రయత్నిస్తున్నామన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులకు తనకు పోటీ కాదని, ఆయా అభ్యర్థులను గుర్తుపట్టే స్థితిలో ప్రజలు లేరన్నారు. ప్రజలు మూడోసారి నరేంద్రమోదీని పట్టాభిషేకం చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, నాయకులు జగన్, విష్ణువర్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్, సంగమేశ్వర్, రాజశేఖర్‌రెడ్డి, మాణిక్‌రావు, హన్మంత్‌రెడ్డి, డా.రాజుగౌడ్, అశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలోని శ్రీనగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు

వైభవంగా దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



పెద్దశంకరంపేటలో దుర్గమ్మ ఆలయం వద్ద ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన చేస్తున్న భక్తులు

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 6: పెద్దశంకరంపేటలోని దుర్గమ్మతల్లి విగ్రహ పునఃప్రతిష్ఠాపన శనివారం వైభవంగా జరిగింది. ఉదయం తొగుట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతిస్వామి దుర్గమ్మతల్లి సంతాననాగేంద్రులు, కేశమ్మ, పాపమ్మ ఆలయాలకు ధ్వజస్తంభం, సింహం, అమ్మవారిపాదుకలు, ప్రతిష్ఠోత్సవాలు నిర్వహించారు. కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాంమహరాజ్ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. మాజీ ఎంపీటీసీ విగ్రాం వేణుగోపాల్‌గౌడ్ తన తండ్రి రామాగౌడ్ జ్ఞాపకార్థం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, వైస్ ఎంపీపీ లక్ష్మీరమేష్, ఎంపీటీసీ వీణాసుభాష్‌గౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మురళీపంతులు తదితరులు పాల్గొన్నారు.

ఖేడ్‌లో దుర్గామాత వార్షికోత్సవం

నారాయణఖేడ్, ఏప్రిల్ 6: నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట దుర్గామాత ఆలయ 17వ వార్షికోత్సవాన్ని శనివారం పురోహితులు మోహన్ జ్యోషి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విశేష పూజా కార్యక్రమాలను చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి, సుప్రీ కోర్టు న్యాయవాది ఉదయ్‌సాగర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

తూప్రాన్ పురాతన శివాలయంలో హోమం

తూప్రాన్, ఏప్రిల్ 6: తూప్రాన్ పట్టణంలోని పురాతన శివాలయంలో హరిహర శంకరాచార్యుల శిష్యులు లోక కల్యాణార్థం శనివారం హోమాది పూజలు నిర్వహించారు. 1996లో శంకరాచార్యులు హైదరాబాద్ నుంచి ధర్మపురి వెళ్లే క్రమంలో తూప్రాన్ శివాలయం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారని, శిష్యులు తిరవూరి శ్రీరామశర్మ గుర్తుచేశారు. 108 ఆలయాల్లో హోమం, పూజలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

'ఇస్రో యూనిక'కు

గజ్వేల్ విద్యార్థిని ఎంపిక



హరిత

గజ్వేల్, ఏప్రిల్ 6: గజ్వేల్ సెయింట్ మేరీస్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని మొగిలి హరిత 'ఇస్రో యూనిక'కు ఎంపికైనట్లు కరస్పాండెంట్ గోపు ఇన్నారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు స్పేస్ టెక్నాలజీ, స్పేస్ సైన్స్, స్పేస్ అప్లికేషన్‌పై అవగాహన కల్పించేందుకు ఫిబ్రవరిలో నిర్వహించిన ఆన్‌లైన్ క్విజ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఇస్రో యూనికకు ఎంపిక చేశారని పేర్కొన్నారు. రాష్ట్రం నుంచి వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా తొమ్మిది మంది విద్యార్థులు ఎంపికవగా, తమ పాఠశాలకు చెందిన హరిత ఎంపికవడం హర్షణీయమని కరస్పాండెంట్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఇస్రో ఆధ్వర్యంలో మే 13 నుంచి 24వరకు హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌లో అవగాహనతో పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థిని మొగిలి హరితను ప్రిన్సిపల్ జయపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

అసంపూర్తి భవనంలో అరకొర వసతులు

చింతమడక బాలికల గురుకులంలో సమస్యల తిష్ఠ



చింతమడకల గ్రామ శివారులో ప్రహరీ లేని బాలికల గురుకుల విద్యాలయం

సిద్దిపేటరూరల్, ఏప్రిల్ 6 : బాలికల గురుకుల పాఠశాలకు సిద్దిపేట రూరల్ మండలం చింతమడక గ్రామ శివారులో రూ.కోటి నిధులతో భవనాన్ని నిర్మించారు. కొత్త భవనం నిర్మించినా విద్యార్థులను పాత సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. అసంపూర్తి భవనంలో అరకొర వసతుల మధ్య విద్యార్థినులు కాలం వెళ్లదీస్తున్నారు.

చింతమడకలో భవనం నిర్మించేంతవరకు ఈ పాఠశాల సిద్దిపేట అర్బన్ మండలంలోని పొన్నాల గ్రామ శివారులో గల కపిల్ హోమ్స్‌లో కొనసాగింది. ఫిబ్రవరిలో చింతమడకలోని కొత్త భవనంలోకి మార్చారు. ప్రస్తుతం ఇక్కడ 241 మంది విద్యార్థులు చదువుతున్నారు. భవనం చుట్టూ ప్రహరీ నిర్మించలేదు. ఏవైనా జంతువులు స్కూల్ భవనంలోకి వస్తాయనే భయంతో విద్యార్థినులు నిద్రపోతున్నారు. తరగతి గదులకు సరిపడే భవనంతో పాటు కిచెన్, డైనింగ్‌హాల్‌కు మాత్రమే గదులు ఉన్నాయి. డార్మెటరీ కోసం గదులు లేకపోవడంతో ప్రస్తుతానికి తరగతి గదులనే డార్మెటరీగా వినియోగిస్తున్నారు. పాఠశాల ఆవరణలో నాలుగు బోర్లు వేసినప్పటికీ అందులో సరిపడా నీరు రావడంలేదు. బోర్ ద్వారా వస్తున్న కొద్దిపాటి నీటినే విద్యార్థినులు అవసరాలకు వినియోగిస్తున్నారు. ప్రతీరోజు తాగు నీరు కొనుగోలు చేస్తున్నారు. వాష్‌రూమ్‌లు సరిపడా లేకపోవడంతో సకాలంలో తరగతులకు హాజరు కాలేకపోతున్నారు.

నేడు మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

● మెదక్ జిల్లా వ్యాప్తంగా 9 పరీక్ష కేంద్రాలు

మెదక్ అర్బన్, ఏప్రిల్ 6: ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాల కోసం ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు డీఈవో రాధాకిషన్ ఓ ప్రకటనలో తెలిపారు. మెదక్ జిల్లా వ్యాప్తంగా 9 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. టేక్మాల్, రేగోడ్, పెద్దశంకరంపేట మండలం తిర్మలాపూర్, చేగుంట మండలం వడియారం, రామాయంపేట మండలం కోమట్‌పల్లి, చిన్నశంకరంపేట జడ్పీ పాఠశాల, నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి జడ్పీ పాఠశాల, జక్కపల్లి మోడల్ స్కూల్‌లో పరీక్ష నిర్వహించనున్నారు. 6, 7, 8, తరగతుల్లో ప్రవేశానికి 3,352 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరగనుంది. అలాగే మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు.

400 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

● హైదరాబాద్ నుంచి నాందేడ్‌కు రవాణా
● తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడి



తూప్రాన్ వద్ద పట్టుబడిన బియ్యం లారీ

తూప్రాన్, ఏప్రిల్ 6 : భారీ ఎత్తున రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ శివారులోని టోల్‌ప్లాజా వద్ద శనివారం తెల్లవారుజామున విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ కె.ద్రోణాచార్యులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి నాందేడ్ (మహరాష్ట్ర)కు లారీలో రేషన్ బియ్యం రవాణా చేస్తున్నట్లు సమాచారం వచ్చింది. దాంతో తూప్రాన్ పోలీసులను అప్రమత్తం చేయగా, శనివారం తెల్లవారుజామున రేషన్ బియ్యం తరలిస్తున్న లారీ పట్టుబడింది. లారీలో 400 క్వింటాళ్ల బియ్యం ఉన్నాయి. పట్టుబడిన రేషన్ బియ్యాన్ని తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ శివారులోని నవదుర్గా రైస్‌మిల్లులో నిల్వ చేశారు. రేషన్ బియ్యం రవాణా చేస్తున్న నిందితుల వివరాల కోసం విచారిస్తున్నారు. దాడుల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌పోర్స్‌మెంట్ తహసీల్దారు ప్రభాకర్, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, సాంబశివరామ్, డిప్యూటీ తహసీల్దారు సాధక్ పాల్గొన్నారు.

దౌల్తాబాద్‌లో 14.5 క్వింటాళ్లు..

దౌల్తాబాద్, ఏప్రిల్ 6 : అక్రమంగా నిల్వచేసిన పీడీఎస్ రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులులు, దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ శుక్రవారం రాత్రి పట్టుకున్నారు. ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ తెలిపిన వివరాల ప్రకారం.. దౌల్తాబాద్ మండల కేంద్రంలో పులుగారి ప్రశాంత్‌గౌడ్ షాపులో అనుమతి లేకుండా రేషన్ బియ్యాన్ని నిల్వ చేశారన్న నమ్మదగిన సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసు అధికారులు, దౌల్తాబాద్ పోలీసులతో కలిసి దాడి చేశారు. 14.5 క్వింటాళ్ల పీడీఎస్ రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. దుకాణాన్ని సీజ్ చేసి నిందితుడిపై కేసు నమోదు చేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, పీడీఎస్ బియ్యం రవాణా చేసిన, నిల్వ ఉంచిన చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

అంకిరెడ్డిపల్లి వద్ద యాబై క్వింటాళ్లు..

రాయపోల్, ఏప్రిల్ 6 : టాస్క్‌ఫోర్స్ అధికారులు, పోలీసులు ఎన్ని దాడులు చేస్తున్నప్పటికీ రేషన్ బియ్యం అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు. తాజాగా శుక్రవారం తెల్లవారుజామున రాయపోల్ పోలీసులు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఎస్ఐ రఘుపతి, రెవెన్యూ అధికారి భానుప్రకాశ్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. రాయపోల్ పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో అంకిరెడ్డిపల్లి వద్ద నిలిపి ఉన్న గూగులోత్ అశోక్‌కు చెందిన బొలెరో వాహనం కనిపించింది. ఈ వాహనాన్ని తనిఖీ చేయగా అందులో పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. డ్రైవర్‌ను పోలీసులు విచారించగా యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వెల్దుర్తి గ్రామం నుంచి బొలేరో వాహనంలో తరలిస్తున్న 52 క్వింటాల్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. బియ్యంతో పాటు బొలెరో వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వగా ఆర్ఐ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని బియ్యాన్ని దౌల్తాబాద్ ఎమ్ఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు.



రైతులతో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్

వరి సాగులో మెలకువలు పాటించాలి

నంగునూరు, ఏప్రిల్ 6: వరి సాగులో రైతులు మెలకువలు పాటిస్తే మంచి దిగుబడిని పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని ముండ్రాయి గ్రామంలోని రైతులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వాతావరణానికి అనుగుణంగా పంటల సాగు చేసుకుని అధిక దిగుబడులు పొందాలని సూచించారు. నూతన వరి వంగడం కాండం కుళ్లు, తెగుళ్లు, అగ్గి తెగుళ్లను సమర్థవంతంగా తట్టుకుంటుందన్నారు. ఈ పంట 125 రోజుల కాల పరిమితి అని, జగిత్యాల 24423 రకంతో పోల్చితే 8నుంచి10 శాతం అధిక దిగుబడిని ఇస్తుందన్నారు. ఈ రకం వరి వానాకాలం, యాసంగి కాలాల సాగుకు అనుకూలంగా ఉంటుందని వివరించారు. అంతకుముందు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం తోర్నాల సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ శాఖ సహకారంతో గ్రామంలోని రైతు గుండెల్లి రాజయ్య క్షేత్రంలో వరంగల్ వ్యవసాయ ప్రాంతీయ పరిశోధన స్థానం నుంచి తెచ్చి సాగుచేసిన డబ్ల్యూజీఎల్-1537 రకం వరి పంటను శాస్త్రవేత్తలతో కలిసి సందర్శించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సతీష్ చంద్ర, వెంకన్న, పల్లవి, విజయ్, ఏవో గీత, ఏఈవోలు అశోక్, మీరాబాయి, ప్రేమ్ సాగర్, సాయివర్మ, శిరీష, రైతులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్

హుస్నాబాద్ టౌన్, ఏప్రిల్ 6: వేసవిలో పట్టణ ప్రజలకు మంచినీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అధికారులకు సూచించారు. శనివారం ఆమె హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో మంచినీటి సమస్యలపై జరిగిన అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడారు. అధికారులు, వార్డు ఆఫీసర్లు ప్రతీ ఇంటికి తాగునీరు వస్తుందో లేదో చూడాలన్నారు. ప్రజలు మంచినీటిని వృథా చేయకుండా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్, ఏఇ సాయి ప్రణీత్ వార్డు ఆఫీసర్లు తదితరులున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అన్నింటా విఫలం

- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతుదీక్ష
- నీటిని వదిలి పంటలను రక్షించాలని డిమాండ్



సిద్దిపేట ఆర్డీవో కార్యాలయం ఎదుట రైతు దీక్షలో ఎండిపోయిన వరి ధాన్యాన్ని చూపిస్తున్న వెంకట్రామారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి



హుస్నాబాద్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 6: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రైతులకు సాగునీరు, విద్యుత్‌నందించడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి విమర్శించారు. శనివారం సిద్దిపేట పట్టణంలోని సిద్దిపేట ఆర్డీవో కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు దీక్ష కార్యక్రమంలో మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వెంకట్రామారెడ్డి మాట్లాడుతూ పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల కోసం ఎంతో చేసిందన్నారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో కరెంట్ కోతలు లేకుండా చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యుత్ కోతలు మళ్లీ మొదలయ్యాయని మండిపడ్డారు. ప్రభుత్వ నిర్వహణలోనే లోపం ఉందని, రాష్ట్ర రైతాంగం దిక్కు తోచని స్థితిలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వారి కోసం కేసీఆర్ పిలుపుతో బీఆర్ఎస్ గళం విప్పుతున్నట్లు చెప్పారు. దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం సాకులు చెప్పి నీరందించడం లేదని, కరెంట్ కూడా ఇవ్వడం లేదని వాపోయారు. కార్యక్రమంలో నాయకులు రాధాకృష్ణశర్మ, వంగ నాగిరెడ్డి, భూపేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను దగా చేస్తున్న కాంగ్రెస్ సర్కార్

- మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్

హుస్నాబాద్, ఏప్రిల్ 6: అబద్దాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను దగా చేస్తున్నదని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ ఆరోపించారు. శనివారం ఆయన హుస్నాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన రైతు దీక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాజకీయాలు చేయడం తప్ప రైతులకు అండగా నిలువడంలో సీఎం రేవంత్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, ఎంపీపీలు మానస, లక్ష్మి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అన్వర్, నాయకులు తదితరులున్నారు.

సర్కార్ అసమర్థతతోనే ఎండుతున్న పంటలు

- మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్

గజ్వేల్, ఏప్రిల్ 6: రేవంత్ సర్కార్ అసమర్థతతోనే పంటలు ఎండుతున్నాయని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్ అన్నారు. గజ్వేల్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాళేశ్వరం విఫల ప్రయోగంగా చూపెట్టి కేసీఆర్‌ను అప్రతిష్టపాలు చేయాలన్న కుటిల బుద్ధితో గోదావరిలో నీళ్లు వృథాగా పోతున్నా ఎత్తిపోయకపోవడంతోనే పంటలు ఎండుతున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఎండిన పంటలకు ఎకరాకు రూ.25వేల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

మండుటెండల్లోనూ సాగునీరందించాం

- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాపరెడ్డి



ట్యాంకర్‌తో నీరు పెడుతున్న రైతును పరామర్శిస్తున్న

కొండపాక, ఏప్రిల్ 6 : మండుటెండల్లో సైతం సాగునీరు అందించిన ఘనత కేసీఆర్‌దని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి పేర్కొన్నారు. మండలం తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో రైతుల భూముల్లో ఎండిన వరి పంటను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. తనకున్న రెండుకరాల్లో ఎకరాకు రూ.30వేల చొప్పున వెచ్చించి వరి పంట సాగుచేస్తే సాగునీరు అందక పూర్తిగా ఎండిపోయిందని ఓ రైతు ప్రతాప్‌రెడ్డి ఎదుట తన గోడును వెళ్లగక్కాడు. మండలంలోని రాయవరం గ్రామంలో ఎండిపోతున్న పొలానికి ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుక్కొని పారించుకుంటున్న మరో రైతు కనకయ్య కష్టాలను ప్రతాప్‌రెడ్డి అడిగి తెలుసుకుని చలించిపోయారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేట జిల్లాలో కొండపోచమ్మ సాగర్, మల్లన్న సాగర్, రంగనాయక సాగర్‌లలో పుష్కలంగా నీరుండేదని, ఈ మూడు ప్రాజెక్టుల ద్వారా కరీంనగర్ మెదక్ సిద్దిపేట జిల్లాల్లో రైతులకు ప్రతి గుంటకూ మండుటెండల్లో సైతం సాగునీరును కేసీఆర్ ప్రభుత్వం అందించిందన్నారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలతో అవన్నీ ఎడారిగా మారే అవకాశం ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు ఎక్కడ కూడా అమలు కావడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఎండిపోతున్న పొలాలకు నీటిని అందించాలని డిమాండ్ చేశారు, ఎండిపోయిన ప్రతీ ఎకరానికి రూ.25వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మరో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నూనె కుమార్, అమరేందర్, అహ్మద్, సున్నం భాస్కర్, మహిపాల్ రెడ్డి, కనకసేన, వంగ శ్రీను,పాండు గౌడ్ ఉన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొని వ్యక్తికి గాయాలు

చేర్యాల, ఏప్రిల్ 6: ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన చేర్యాల శివారులో శుక్రవారం రాత్రి జరిగింది. నాగపురి గ్రామానికి చెందిన తుమ్మ మల్లయ్య తన మోపెడ్ బండిపై చేర్యాల నుండి నాగపురికి వెళ్తుండగా కర్షకనగర్ కాలనీ సమీపంలో ఆటో ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాఇ. చుట్టుపక్కలవారు గమనించి అంబులెన్సు ద్వారా సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో ప్రాథమిక చికిత్స అనంతరం హైదరాబాద్‌కు తరలించారు.

కల్తీ కేక్‌ను విక్రయించిన బేకరీ సీజ్

హుస్నాబాద్, ఏప్రిల్ 6: హుస్నాబాద్ పట్టణంలోని బస్టాండ్ కాంప్లెక్స్‌లో ఉన్న ఓ బేకరీని శనివారం సీజ్ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ శనివారం తెలిపారు. పట్టణానికి చెందిన ఒక వినియోగదారుడు ఇటీవల సదరు బేకరీలో కేక్‌ను కొనుగోలు చేసి తినగా వాంతులు అయ్యాయి. కాలం చెల్లిన కేక్ తినడం వల్లే వాంతులు అయ్యాయని బాధితుడి ఫిర్యాదు మేరకు మున్సిపల్ సిబ్బందితో కలిసి బేకరీలో తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలం చెల్లిన(ఎక్స్‌పైర్డ్) కేక్‌ను విక్రయించినట్లు తేలడంతో బేకరీని సీజ్ చేశామని చెప్పారు. కల్తీతో పాటు నాణ్యత లేని తినుబండారాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు.

అగ్నిగుండాలకు పటిష్ట బందోబస్తు : చేర్యాల సీఐ



తోటబావి ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న చేర్యాల సీఐ శ్రీను

చేర్యాల, ఏప్రిల్ 6: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల చివరివారంతో పాటు ఆదివారం రాత్రి చేపట్టనున్న అగ్నిగుండాల కార్యక్రమ నిర్వహణకు పటిష్టబందోబస్తు ఏర్పాటు చేసినట్లు చేర్యాల సీఐ శ్రీను పేర్కొన్నారు. అగ్నిగుండాలు నిర్వహించే మల్లన్న ఆలయ తోటబావి ప్రాంగణాన్ని శనివారం సాయంత్రం ఆయన పరిశీలించిన అనంతరం మాట్లాడారు. భక్తులు భారీగా తరలిరానున్నందున ట్రాఫిక్, ఇతర సమస్యలు తలెత్తకుండా 250మంది పోలీసు అధికారులు, సిబ్బందితో కలిపి బందోబస్తు చేపట్టనున్నట్లు తెలిపారు. అనుమానిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండి వెంటనే పోలీసులకు తెలియజేయాలని భక్తులకు సూచించారు.

దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎస్ఐ

దౌల్తాబాద్, ఏప్రిల్ 6: ఎండకాలంలో దొంగతనాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ పేర్కొన్నారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ శ్రీరామ్‌ప్రేమ్‌దీప్ విలేకరులతో మాట్లాడుతూ.. ఎండాకాలం సెలవుల్లో ప్రజలు ఏవైనా ఫంక్షన్‌లకు లేదా ఊరికి వెళ్లే ముందు బంగారు అభరణాలు, డబ్బులు ఉంటే వెంట తీసుకుపోవాలని లేదా బ్యాంక్‌లో పెట్టుకోవాలని సూచించారు. ఎవరైనా అనుమానాస్పదంగా గ్రామాల్లో కనబడితే పోలీసులకు సమాచారమివ్వాలన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

సిద్దిపేటరూరల్, ఏప్రిల్ 6: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో సిద్దిపేట రూరల్ మండలంలోని రాఘవాపూర్, పుల్లూరు, చింతమడక, నారాయణరావుపేట మండల పరిధిలో లక్ష్మీదేవిపల్లి, నారాయణరావుపేట గ్రామాల్లో ఆదివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుండి 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని సూచించారు.

దళారులను నమ్మి మోసపోవద్దు: ఎంపీడీవో



నారాయణరావుపేట: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో శ్రీరాములు

నారాయణరావుపేట, ఏప్రిల్ 6: రైతులు దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దని ఎంపీడీవో శ్రీరాములు పేర్కొన్నారు. శనివారం నారాయణరావుపేట మండల కేంద్రంతో పాటు లక్ష్మీదేవిపల్లి, కోదండరావుపల్లి, ఇబ్రహీంపూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రైతులు మార్కెట్ యార్డుకు వచ్చేటప్పుడు ధాన్యం ఆరబెట్టుకొని తీసుకొని రావాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో నాగార్జున్, ఏపీఎం ధర్మసాగర్, పంచాయితీ కార్యదర్శులు కిషన్‌రావు, శ్రీధర్, రేఖారాణి, సీసీ హేమలత, రైతులు పాల్గొన్నారు.

● **చిన్నకోడూరు:** ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని ఎంపీడీవో జనార్దన్, ఏపీఎం మహిపాల్ అన్నారు. శనివారం మండలంలోని ఇబ్రహీంనగర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సీసీలు ఈశ్వరమ్మ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

● **కుకునూరుపల్లి:** కుకునూరుపల్లి మండలం లకుడారం గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర ఉంటుందని దళాలను నమ్మి రైతులు మోసపోవద్దని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సిబ్బంది రాకేష్, హమాలీ సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సలాఖ్‌పూర్‌లో 'కనువిప్పు'



కనువిప్పు కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ

మద్దూరు, ఏప్రిల్ 6: మండలంలోని సలాఖ్‌పూర్ గ్రామంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కళాబృందం సభ్యులు ప్రజల్ని చైతన్యపర్చేందుకు కనువిప్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చేర్యాల సీఐ ఎల్ శ్రీను మద్దూరు ఎస్ఐ షేక్ యూనస్ అహ్మద్ అలీతో కలిసి మాట్లాడారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తతతో ఉండాలన్నారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే వెంటనే సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల పట్ల దూరంగా ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యలు, వాహన చట్టాలు, సైబర్ నేరాల గుర్చి పాటల రూపంలో కళాబృందం సభ్యులు ప్రజల్ని చైతన్యపర్చారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు బాలు, రాజు, రవీందర్, తిరుమల పాల్గొన్నారు.

'సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా ఉద్యమించాలి'

గజ్వేల్, ఏప్రిల్ 6: సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య పిలుపునిచ్చారు. సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు బీటీ రణదీవే 34వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీటీ రణదీవే స్వతంత్ర్య పోరాటంలో పాల్గొని, దేశవిముక్తి కోసం పోరాటం చేశారని, ముంబైలో జ్యూట్, తదితర పరిశ్రమల్లో కార్మిక సమస్యలపై ఉద్యమాలు చేశారన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం కార్మికుల మధ్య ఐక్యతను విచ్ఛిన్నం చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు రంగారెడ్డి, రవి, మహేందర్‌రెడ్డి, రాజు, లింగం, వెంకటేశ్ తదితరులున్నారు.

తుక్కుగూడ జనజాతరకు తరలిన కాంగ్రెస్ నాయకులు



సిద్దిపేటలో తుక్కుగూడ సభకు వెళ్తున్న వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న కాంగ్రెస్ పూజల హరికృష్ణ

సిద్దిపేట టౌన్/గజ్వేల్/కొండపాక/దుబ్బాక/మిరుదొడ్డి/చేర్యాల/కుకునూరుపల్లి, ఏప్రిల్ 6: కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ పేర్కొన్నారు. శనివారం సిద్దిపేటలోని కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయం నుంచి హైదరాబాద్‌లోని తుక్కుగూడ జనజాతర సభకు సిద్దిపేట నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అమలుపరిచిన ఆరు గ్యారంటీలలో భాగంగానే కేంద్రంలో కూడా పాంచ్ న్యాయ్ - పచ్చీస్ గ్యారెంటీల మేనిఫెస్టోను ప్రకటించనున్నట్టు తెలిపారు. సిద్దిపేట పట్టణంలో పీసీసీ సభ్యుడు చంద్రం ఆధ్వర్యంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు తుక్కుగూడ జనజాతర సభకు తరలివెళ్లారు. గజ్వేల్‌లో సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి స్వగృహం నుంచి తుక్కుగూడ జనజాతర సభకు కాంగ్రెస్ నాయకులు బయలుదేరి వెళ్లారు. కొండపాక నుంచి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వాసరి లింగారావు, మాజీ అధ్యక్షుడు అనంతుల నరేందర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు భారీగా వెళ్లారు. దుబ్బాక, మిరుదొడ్డి మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు తుక్కుగూడకు భారీగా తరలివెళ్లారు. తరలినవారిలో కాంగ్రెస్ దుబ్బాక, మిరుదొడ్డి మండలపార్టీ అధ్యక్షుడు కొంగరి రవి, నాయకులు ఉన్నారు. జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల నుంచి ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు వాహనాల్లో తరలివెళ్లారు. కుకునూరుపల్లి మండలంలోని వివిధ గ్రామాల నుంచి మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌శ్రేణులు తరలివెళ్లాయి.

దళితులపై దాడులు చేస్తే శిక్షలు తప్పవు



ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న డీబీఎఫ్ నాయకులు

గజ్వేల్, ఏప్రిల్ 6: దళితులను కులం పేరుతో దూషించి దాడులకు పాల్పడుతున్న వారికి చట్ట ప్రకారం శిక్షలు తప్పవని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. గజ్వేల్‌లో దళిత న్యాయవాది రాజుపై, ములుగు మండలం కొత్తూరులో దళిత యువకులు దాసు, శ్రీకాంత్, ఎల్లారావులపై దాడికి పాల్పడిన నిందితులను శిక్షించాలని కోరుతూ డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పెద్దలింగన్నగారి శంకర్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ ముగిసిన వెంటనే రాష్ట్రమంతా పర్యటించి కలెక్టర్లు, జిల్లా పోలీస్ అధికారులతో సమీక్షించి దాడుల నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. వెంట బాధితులు ఎల్లారావు, శ్రీకాంత్, దాసు ఉన్నారు.

'వివేకానంద'లో ఎల్లో డే



ఎల్లో డే వేడుకల్లో పాల్గొన్న వివేకానంద విద్యార్థులు

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 6 : స్థానిక భారత్‌నగర్‌లోని వివేకానంద ఇంగ్లిష్ మీడియం స్కూల్లో ఎల్లో డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పిల్లలు పసుపు రంగు దుస్తులు ధరించి, పసుపు రంగులో ఉండే సాధారణ విషయాలను తెలుసుకున్నారు. పసుపు రంగులో ఉండే సన్ ఫ్లవర్, మ్యాంగో, అరటిపండు తదితర వేషధారణలో పిల్లలు అందరినీ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ యాళ్ల భాస్కర్ రెడ్డి, కరెస్పాండెంట్ లిఖిత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధిహామీ'ని పరిశీలించిన ఏంపీడీవో

ధూళిమిట్ట, ఏప్రిల్ 6:మండలంలోని కూటిగల్ గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను శనివారం మద్దూర్ ఏంపీడీవో రాంమోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం తొందరగా వెళ్లి పనులు పూర్తి చేసుకొని ఇళ్లకు చేరుకోవాలన్నారు. ఎక్కువగా మంచినీళ్ళు తాగాలని సూచించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్లి రికార్డులను తనిఖీ చేశారు. సబ్ సెంటర్‌లో పిల్లలకు వేస్తున్న వ్యాక్సిన్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఏంపీవో ఖాజా, టీఏ దేవేందర్, కార్యదర్శి అనిత, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల అందజేత

మద్దూరు, ఏప్రిల్ 6: మద్దూరు మండలం లద్నూరులో ఉపాధిహామీ పనులు చేపడుతున్న కూలీలకు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. మండే ఎండల తీవ్రత మూలంగా వడదెబ్బ సోకకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్నట్లు ఏఎన్ఎం యాదమ్మ తెలిపారు. వడదెబ్బ సోకకుండా పలు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కూలీలకు సూచించినట్లు తెలిపారు.

దంతాలను సంరక్షించుకోవాలి



బాలికలకు శిబిరంలో పరీక్ష చేస్తున్న వైద్యులు

తొగుట, ఏప్రిల్ 6: చిన్నప్పటి నుంచే దంతాలను సంరక్షించుకోవాలని తెలంగాణ డెంటల్ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ అరవింద్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో తెలంగాణ డెంటల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. 5 నుంచి 9వ తరగతి వరకు చదివే విద్యార్థులు 397మందికి దంత పరీక్షలు నిర్వహించారు. డాక్టర్లు అరవింద్, స్పందనరాణి, శ్రీనిధి, రమాదేవి వైద్య పరీక్షలు నిర్వహించారు.

నేడు మోడల్‌స్కూల్ ప్రవేశపరీక్ష

దుబ్బాక, ఏప్రిల్ 6: దుబ్బాక మున్సిపాలిటీలోని లచ్చపేట మోడల్‌స్కూల్‌లో ఆదివారం 7 నుంచి 10వ తరగతి వరకు నిర్వహించే ప్రవేశపరీక్షకు ఏర్పాట్లు పూర్తయ్యాయని దుబ్బాక ఎంఈవో ప్రభుదాస్ తెలిపారు. శనివారం లచ్చపేటలో పరీక్షాకేంద్రాన్ని పరిశీలించారు. పరీక్ష రాసే విద్యార్థులు సెంటర్ వద్దకు ఉదయం 10 గంటలలోపు చేరుకోవాలని సూచించారు.

జిల్లాలో ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

బీజేపీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లావ్యాప్తంగా ఆయా మండలాల్లోని గ్రామాల్లో పార్టీ జెండాలను ఎగురవేశారు. అనంతరం పార్టీ ముఖ్య నాయకులు పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.



సిద్దిపేట బీజేపీ కార్యాలయం పార్టీ జెండాను ఎగురవేస్తున్న బీజేపీ నాయకులు



హుస్నాబాద్‌లో పార్టీ జెండాను ఎగురవేస్తున్న బీజేపీ నాయకులు

సిద్దిపేట క్రైం/సిద్దిపేటరూరల్, ఏప్రిల్ 6: భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం బీజేపీ జిల్లా కార్యాలయం వద్ద జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం టిఫిన్ బైఠక్ కార్యక్రమంలో పాల్గొని రానున్న పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఎన్నికల్లో మెదక్ సీటు గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు విద్యాసాగర్, ఉపేందర్‌రావు, కానుగంటి శ్రీనివాస్, తొడుపునూరి వెంకటేశం, బైరిశంకర్, కృష్ణ, తాటికొండ శ్రీనివాస్, హేమంత్ పాల్గొన్నారు. అదేవిధంగా సిద్దిపేట రూరల్ మండలంలోని రాఘవపూర్ గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు అన్నసారం సురేష్‌గౌడ్ ఆధ్వర్యంలో జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నవీన్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● **గజ్వేల్:** గజ్వేల్ పట్టణంలో బీజేపీ కార్యాలయం వద్ద పార్టీ జెండాను గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పట్టణాధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్ ఎగురవేశారు.కార్యక్రమంలో సీనియర్ నాయకుడు రాంరెడ్డి, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ సాయిబాబ, కోకన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● **నంగునూరు:** మండల కేంద్రంలో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రజినీకర్ రెడ్డి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

● **చేర్యాల:** బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం చేర్యాల, కొమురవెల్లి మండలాల్లో ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. చేర్యాల మండలం వేచరేణి గ్రామంలో బీజేపీ చేర్యాల మండల ప్రధాన కార్యదర్శి తౌటబాలరాజు, బూరుగు సురేశ్, కొమురవెల్లి మండలం తపాస్‌పల్లి గ్రామంలో పార్టీ మండలాధ్యక్షుడు బూర్గోజు నాగరాజు, గుర్రాల రాములు, మర్రిముచ్చాల గ్రామంలో బొడిగం కృష్ణారెడ్డి, వంగ శివారెడ్డి పార్టీ జెండా ఆవిష్కరించారు.

● **దౌల్తాబాద్:** మండల కేంద్రంలో పాటు ఆయా గ్రామాల్లో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.మండల పార్టీ అధ్యక్షుడు సర్వుగారి భూపాల్‌రెడ్డి పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నర్సింహులు, కిషన్, ముత్యాల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

● **హుస్నాబాద్ టౌన్:** హుస్నాబాద్ పట్టణంలోని అక్కన్నపేట చౌరస్తాలో శనివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ సీనియర్ నాయకులను సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొత్తపల్లి దేవేందర్, కొత్తపల్లి అశోక్, రాజయ్య గంగిశెట్టి గాంధీ, లక్కిరెడ్డి తిరుమల తదితరులున్నారు.

● **కుకునూరుపల్లి:** బీజేపీ మండల అధ్యక్షుడు అనుముల సంపత్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద జెండా ఆవిష్కరించి టిఫిన్ బైటక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు దాసరి స్వామి, అనిల్, నవీన్, సంతోష్, సాయికుమార్ పాల్గొన్నారు.

● **ములుగు:** మండలంలోని వాగునూతి గ్రామంలో యువమోర్చా మండల అధ్యక్షుడు కృష్ణయాదవ్ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో గ్రామాల్లో ప్రచారతీరుపై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో లక్ష్మణ్‌గౌడ్, జిల్లా మహిళా కట్ట భాగ్యలక్ష్మి, మండల ఉపాధ్యక్షులు బట్టు ఎలంధర్‌రెడ్డి, కొండు నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

● **కొండపాక:** మండలంలోని కొండపాక, మర్పడగ, అంకిరెడ్డిపల్లి, బందారం గ్రామాల్లో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ మండల ఉపాధ్యక్షుడు కొండూరి మల్లేశం, ఎస్సీ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి బర్రె కిషన్, తదితరులు పాల్గొన్నారు.

● **నారాయణరావుపేట:** మండలంలోని ఆయా గ్రామాల్లో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడు పొన్నాల బాబు మాట్లాడుతూ కార్యకర్తలు పార్టీ పటిష్టానికి సంబంధించి కార్యకర్తలకు సూచనలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బాపురెడ్డి, బాల్‌రాజాం, బుగ్గరాజేశం, శ్రీకాంత్‌గౌడ్, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● **కోహెడ:** మండల కేంద్రంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం పార్టీ జెండాను ఎగురవేశారు. టిఫిన్ బైటక్ ప్రోగ్రామ్ నిర్వహించి సీనియర్ నాయకులు అన్నాడి మధుసూదన్ రెడ్డి, ఎర్రవెల్లి హరిదాస్, విశ్వనాథం రాజయ్య, భీంరెడ్డి లక్మారెడ్డిని శాలువాతో సత్కరించారు.

● **చిన్నకోడూరు:** చిన్నకోడూరులోని బీజేపీ మండల కార్యాలయం వద్ద జెండాను పార్టీ మండలాధ్యక్షుడు సూరగోని శేఖర్‌గౌడ్ ఎగురవేశారు.